

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి-విజయనగరం

గణతంత్ర దినోత్సవ వేడుకలకు పోలీస్ పెరేడ్ మైదానంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం ఉదయం 9 గంటల కు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జిల్లా ప్రగతిని వివరిస్తారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధిని కనపరిచేల 13 శాఖల నుండి శకటాల ప్రదర్శన, 13 శాఖల కు చెందిన స్టాళ్లు ప్రదర్శించనున్నారు. పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన, ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాల పంపిణీ ఉంటుంది. ఏర్పాట్లను గురువారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ లో అధికారులతో కలసి పర్యవేక్షించారు.

నింగికెగసిన స్ఫూర్తి

- ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం
- ఓటు హక్కు వినియోగించడం మన బాధ్యత : జెసి అశోక్



బెలూన్లు ఎగురవేస్తున్న అధికారులు

ప్రజాశక్తి-విజయనగరం

జాతీయ ఓటర్ల దినోత్సవ స్ఫూర్తిని చాటిచెప్పేలా, ఓటుహక్కు ప్రాముఖ్యతను వివరిస్తూ 14వ జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఓటుహక్కు ప్రాధాన్యతను వివరిస్తూ ర్యాలీలు, నినాదాలతో పుర వీధులు మారుమ్రోగాయి. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ముఖ్య అతిధిగా హాజరై, అయోధ్యా మైదానంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐ ఓట్ ఫర్ ష్యూర్ నినాదాన్ని మానవ హారంతో ప్రదర్శించారు. విద్యార్థులు విన్యాసాలు చేశారు. బెలూన్లు ఎగురవేసి స్ఫూర్తిని చాటారు. మైదానం చుట్టూ విద్యార్థులు జాతీయ పతాకాలతో మానవహారం నిర్వహించారు. పులివేషాలు, కోలాటం, విచిత్ర వేషాలు, డప్పుల చప్పుడుతో మైదానం హోరెత్తిపోయింది. అక్కడినుంచి భారీ ప్రదర్శన నిర్వహిస్తూ గురజాడ కళాక్షేత్రానికి చేరుకున్నారు.

ఓటుహక్కు వినియోగించుకోవడం మన బాధ్యత

ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతీ పౌరుని బాధ్యత అని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అన్నారు. గురజాడ కళాక్షేత్రంలో జరిగిన జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్య మనుగడకు, దేశాభివృద్ధికి ఓటు మూలస్థంభం లాంటిదని పేర్కొన్నారు. ఓటుహక్కు ప్రాధాన్యతను వివరించేందుకు 2011 నుంచి ప్రతీఏటా జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతీఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే కాకుండా, దానిని శతశాతం వినియోగించుకొనే విధంగా ప్రతీఒక్కరికీ అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని చెప్పారు. వచ్చే ఎన్నికలలో శాతశాతం ఓటుహక్కు వినియోగించుకొనే విధంగా ఓటర్లను చైతన్య పరుస్తామని అన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటికీ, అర్హత ఉన్నవారందరికీ నిబంధనల మేరకు ఓటుహక్కు కల్పిస్తామని జెసి తెలిపారు.

ఈ సందర్భంగా స్వీప్ కార్యక్రమం కేలండర్‌ను ఆవిష్కరించారు. ప్రచార రథాన్ని ప్రారంభించారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని, విజయనగరం కోట చుట్టూ మానవ హారాన్ని ఏర్పాటు చేశారు. ప్రతిజ్ఞ చేయించారు. భారత ముఖ్య ఎన్నికల నిర్వహణ అధికారి రాజీవ్ కుమార్ సందేశాన్ని వినిపించారు. సీనియర్ ఓటరు మురళీలాల్ శర్మ, యువ ఓటర్ ఆదాడ మనోహర్, విభిన్న ప్రతిభావంతుడు డి.కొండబాబు, ట్రాన్స్ జెండర్ డి.మీనాలను సన్మానించి, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రశంసనీయంగా పనిచేసిన ఇఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలు, ఎన్నికల డిటిలు, సూపర్‌వైజర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితర 59 మందికి ప్రశంసా పత్రాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన పులివేషాలు, కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాకారులను, ఆహూతులను జ్ఞాపికలతో సత్కరించారు.

కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, ఆర్‌డిఒ ఎం.వి.సూర్యకళ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సుదర్శనదొర, నూకరాజు, జెడ్‌పి సిఇఒ కె.రాజ్‌కుమార్, మెప్మా పీడీ సుధాకరరావు, విజయనగరం తాహశీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, పలువురు జిల్లా అధికారులు, పిఇటిలు, విద్యార్థులు, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



'ఐ ఓటీ ఫర్ ష్యూర్' ఆకారంలో విద్యార్థుల మానవహారం

కలెక్టర్‌కు ఉత్తమ ఎన్నికల అధికారి అవార్డు

విజయనగరం : జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఉత్తమజిల్లా ఎన్నికల అధికారిగా అవార్డు అందుకున్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం లో గురువారం జరిగిన రాష్ట్ర స్థాయి జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకల్లో ఉత్తమ జిల్లా ఎన్నికల అధికారిగా రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ నుండి అవార్డు స్వీకరించారు. ఓటర్ల సవరణ జాబితాలో భాగంగా ఉత్తమ ప్రతిభ కనపరిచినందుకు రాష్ట్రంలో ముగ్గురు కలెక్టర్లను ఎంపిక చేయగా వారిలో విజయనగరం కలెక్టర్ ఒకరు. బిఎల్‌ఒ కేటగిరీలో గాజులరేగకు చెందిన పి.హేమలత కూడా ఇదే వేదిక నుండి అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి పాల్గొన్నారు.



గవర్నర్ నుంచి అవార్డు అందుకుంటున్న కలెక్టర్ నాగలక్ష్మి



మానవహారం చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు, నిరుద్యోగులు

మెగా డిఎస్‌సి ప్రకటించాలి

డివైఎఫ్ఐ ఆధ్వర్యాన ర్యాలీ, మానవహారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మెగా డిఎస్‌సి వెంటనే ప్రకటించాలని డిమాండ్‌చేస్తూ భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో గురువారం నిరుద్యోగులు నగరంలో ర్యాలీ నిర్వహించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం నుంచి కోటజంక్షన్ వరకు భారీ ప్రదర్శన చేశారు. అనంతరం అక్కడ మానవహారం చేపట్టారు. రాష్ట్రంలో నిరుద్యోగులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ తక్షణం విడుదల చేయాలని, జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ హరీష్ మాట్లాడుతూ 2019 ఎన్నికల ముందు నిరుద్యోగులకు జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నింటికీ నోటిఫికేషన్లు విడుదల చేస్తానని, ప్రతి ఏటా ఖాళీ అయ్యే ఉద్యోగాలతో కలిపి ప్రతి జనవరికి జాబ్ క్యాలెండర్లు విడుదల చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. 2018 డిఎస్‌సి తర్వాత ఇప్పటివరకు ఒక్క డిఎస్‌సి కూడా విడుదల చేయలేదన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు పేరుతో పనులు చేసి విద్యార్థుల సంఖ్యను పెంచామని గొప్పలు చెప్పుకునే జగన్మోహన్ రెడ్డికి ఆ విద్యార్థులకు చదువు చెప్పడానికి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని ఆలోచన లేకపోవడం హేయమని అన్నారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి 50వేల పోస్టులు ఖాళీలున్నాయని పార్లమెంట్‌లో ప్రకటిస్తే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఒకరోజు 714 అని, మరో రోజు ఎనిమిది వేలు అని ఇంకొక రోజు 69అని నోటికి వచ్చినట్టు చెప్పడం నిరుద్యోగులను హేళన చేయడమేనన్నారు. బిఇడి, టిటిసి చదువుకొని రాష్ట్రంలో పది లక్షల మంది కోచింగ్ సెంటర్లు స్టడీ హాల్స్ లో మగ్గిపోతున్నారు, వీరి బాధలు రాష్ట్ర ప్రభుత్వానికి పట్టవా అని ప్రశ్నించారు. తక్షణమే 25 వేల పోస్టులతో మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని, మూత పడిన ప్రభుత్వ పరిశ్రమలను తెరిపించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని, లేనిపక్షంలో జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈనెల 27 28 తేదీలలో విజయవాడ కేంద్రంలో రెండు రోజులపాటు జరుగు నిరాహార దీక్షలో నిరుద్యోగులంతా పాల్గొని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ ఉపాధ్యక్షులు సతీష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.రామ్మోహన్, ఎస్ఎఫ్ఐ నాయకులు, నిరుద్యోగులు పాల్గొన్నారు.



రియల్ ఎస్టేట్ వ్యాపారులను అడ్డుకుంటున్న జ్యూట్ కార్మికులు

రియల్ ఎస్టేట్ వ్యాపారుల అడ్డగింత

ప్రజాశక్తి-బొబ్బిలి

జ్యూట్‌మిల్లు స్థలంలోకి రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెళ్లకుండా గురువారం జ్యూట్ కార్మికులు అడ్డుకున్నారు. శ్రీలక్ష్మి శ్రీనివాస జ్యూట్ మిల్లు కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ బకాయిలు చెల్లించకుండా యాజమాన్యం రియల్ ఎస్టేట్ వ్యాపారులకు స్థలాన్ని విక్రయించింది. జ్యూట్ కార్మికులకు పిఎఫ్ బకాయిలు చెల్లించకపోవడంతో అర్హత ఉన్న కార్మికులకు పింఛను రావడం లేదు. దీంతో పిఎఫ్ బకాయిలు చెల్లించాలని కార్మికులు పలు దఫాలుగా ఆందోళన చేసినప్పటికీ యాజమాన్యం పట్టించుకోలేదు. జ్యూట్ మిల్లు స్థలంలోకి వెళ్లేందుకు కొనుగోలు చేసిన వ్యాపారులు ప్రయత్నించగా, ఆదర్శ కార్మిక సంఘం నాయకులు, కార్మికులు అడ్డుకున్నారు. మళ్లీ గురువారం జ్యూట్ మిల్లు స్థలంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా ఆదర్శ కార్మిక సంఘం నాయకులు వి.శేషగిరిరావు, పి.కృష్ణ, జి.రామా రావు, కార్మికులు అడ్డుకున్నారు. పిఎఫ్, ఇఎస్ఐ బకాయిలు చెల్లించే వరకు స్థలంలోకి వెళ్లకుండా అడ్డుకుంటామని చెప్పగా, ఇరువురి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. కార్మికులు పట్టువీడకుండా ఉండడంతో వ్యాపారులు వెనుదిరిగారు. తక్షణమే బకాయిలు చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేశారు.

రాజాం నియోజకవర్గంలో

వైసిపి నుంచి భారీగా వలసలు

- పట్టు కోల్పోతున్న అధికార పార్టీ
- జోగులు మార్పుతో మారుతున్న పరిణామాలు

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

రాజాం అసెంబ్లీ నియోజకవర్గంలో వైసిపి నుంచి భారీగా వలసలు మొదలయ్యాయి. గడిచిన 10 రోజులుగా వైసిపి నుంచి పలువురు టిడిపిలో చేరుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే కంబాల జోగులును ఈసారి ఇక్కడి నుంచి తప్పించడం తోపాటు కొత్తగా నియమించిన అభ్యర్థికి గ్రామస్థాయిలో పెద్దగా పరిచయాలు లేకపోవడం ఇందుకు కారణాలుగా కనిపిస్తున్నాయి. టిడిపి నుంచి టిక్కెట్ ఆశిస్తున్న కోండ్రు మురళీ మోహన్ పరిచయాలు కూడా మరో కారణంగా చెప్పుకోవచ్చు. రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యే జోగులును పాయకరావుపేట ఇన్‌ఛార్జిగా నియమించడంతో గత 15 రోజులుగా టిడిపిలో నిస్తేజంగా మారింది. వైసిపి నియోజకవర్గ ఇన్చార్జి గా డాక్టర్ తలే రజేష్‌బాబును నియమించినప్పటికీ ఆయన పూర్తిగా రాజకీయాలకు కొత్త. మండల స్థాయి నాయకులు తప్ప గ్రామ స్థాయి నాయకులతో కనీస పరిచయాలు లేని పరిస్థితి. దీనికి తోడు జోగులు మార్పును జీరంచుకొలేని వారూ అక్కడక్కడ అన్నారు. ఇదే అదునుగా రంగం లోకి దిగిన టిడిపి నాయకులు కోండ్రు మరళీమోహన్ వైసిపిపై అసంతృప్తిగా ఉన్నవారిని, అభివృద్ధి జరగలేదని నిరాశతో ఉన్నవారిని కలిసి పార్టీలోకి లాగుతున్నారు. గత వారం రోజులుగా రేగిడి, వంగర తదితర మండలాల నుంచి వైసిపి నాయకులు ఆ పార్టీని వీడి, టిడిపిలో చేరడమే ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

తాజాగా గురువారం బాలకావివలస వైస్ సర్పంచ్ సహా ఆ గ్రామంలోని 250 కుటుంబాలు టిడిపిలో చేరాయి. 22న కొండవలస, మాజీ సర్పంచ్ తమ్మి పద్మావతి, లక్ష్మీపురం ఎంపిటిసి సభ్యుడు కెంబూరు అప్పలనాయుడు సహా ఆయా గ్రామాల్లోని వందలాది కుటుంబాలు చేరాయి. 25న అదే మండలం పెద శిర్లం, ఖండ్యం గ్రామాలకు చెందిన వైసిపి కార్యకర్తలు భారీగానే టిడిపిలో చేరారు.

లచ్చరాయి పురం పంచాయతీ గేడాపేట గ్రామస్తులు మాజీ ఎంపిటిసి నడిపేన సన్ని బాబు నాయకత్వంలో చేరారు. ఎలా వైసిపి నుంచి టిడిపిలో చేరిన వారిలో ఎక్కువ మంది నాయకులు జగన్ ప్రభుత్వంలో గ్రామాలు అభివద్ధి చెందలేదని, చివరికి గ్రామ సచివాలయంలో కూడా తమకు విలువ లేకుండా పోయిందని ఆవేదన చెందుతున్నారు. చివరికి ప్రభుత్వ పథకాలు ఇప్పించడం లోనూ తమ పాత్ర లేకుండా పోయిందని, అందువల్లే వైసిపిని వీడాల్సి వచ్చిందని చెబుతున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే ఈసారి వైసిపి గట్టెక్కేలా లేదని కొందరు వ్యాఖ్యనిస్తుండగా, సీట్ల సర్దబాటు పూర్తి కాగానే తిరిగి వైసిపి పుంజుకుంటుందని మరి కొందరు వ్యాఖ్యానిస్తున్నారు.



టిడిపిలో చేరిన వారితో మాజీమంత్రి కోండ్రు మురళీమోహన్

29 నుంచి విద్యుత్ నియంత్రణ మండలి ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యం 2024-25 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణను స్థానిక విద్యుత్ భవన్ ఎస్ఇ కార్యాలయం, బొబ్బిలి, పార్వతీపురం ఇఇ కార్యాలయాల్లో ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 1 వరకు నిర్వహిస్తామని ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ ఎమ్.లక్ష్మణ రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం జరుగుతుందన్నారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ ప్రజాభిప్రాయ సేకరణలో విద్యుత్ నియంత్రణ మండలి ప్రతిరోజు అన్ని డిస్కమ్‌ల టారిఫ్ ఫైలింగ్‌కు సంబంధించిన సూచనలు అభ్యంతరాలు వింటారని తెలిపారు. విశాఖపట్నం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగే ఈ కార్యక్రమం ఆయా తేదీల్లో ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు నిర్వహిస్తారని, ఈ ధరలపై సందేహాలు, సూచనలు ఇచ్చేందుకు వినియోగదారులెవరైనా పాల్గొనవచ్చున్నారు. ఈ మేరకు రిజిస్ట్రేషన్ కొరకు స్థానిక విద్యుత్ ఆపరేషన్ సర్కిల్ కార్యాలయములో(ఎస్ఇ ఆఫీస్) లేదా ఏదైనా విద్యుత్ డివిజనల్ కార్యాలయాల్లో సంప్రదించాలని కోరారు.

సమస్యలపై పింఛనుదారుల ధర్నా



గంట్యాడలో ధర్నా చేస్తున్న పింఛనుదారులు

ప్రజాశక్తి-గంట్యాడ

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద పింఛనుదారులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పింఛనుదారుల సంఘం మండల అధ్యక్షులు ముదునూరి సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పింఛనుదారులను పట్టించుకోవడం లేదన్నారు. తమకు రావాల్సిన ఎరియర్స్ బకాయిలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం కొనసాగిస్తామని స్పష్టంచేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ స్వర్ణకుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పింఛనుదారుల సంఘం మండల కార్యదర్శి బూడి సత్యనారాయణ, కోశాధికారి చల్ల కృష్ణమనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని తహశీల్దార్ కార్యాలయం వద్ద విశ్రాంత ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు రైతు శంకర్రావు, మండల అధ్యక్షులు బైరాగిరాజు, సూర్యనారాయణ, నాని, వల్లయ్య, వెంకటరమణ, రామకృష్ణ, అప్పారావు పాల్గొన్నారు.

భోగాపురం : పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ బంగార్రాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం మండల అధ్యక్షులు వరుపులు భాస్కరరావు, కార్యదర్శి పిహెచ్ బ్రహ్మారావు, ట్రెజరర్ జె.మాధవరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.వి.రమణ, జిల్లా కార్యవర్గ సభ్యులు గణేష్ పాల్గొన్నారు.

తగిన ప్రాధాన్యత లేకపోతే సత్తా చూపుతాం

కొప్పల వెలమ సంక్షేమ సంఘం నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రానున్న ఎన్నికల్లో తమకు తగిన ప్రాధాన్యత ఇవ్వకపోతే తామేంటో నిరూపిస్తామని కొప్పుల వెలమ సంక్షేమ సంఘం నాయకులు హెచ్చరించారు. కొప్పుల వెలమ జిల్లా నూతన కార్యవర్గం ఏర్పడింది. గురువారం స్థానిక కొప్పుల వెలమ సంక్షేమ భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నూతన కమిటీని ప్రకటించారు. గౌరవ అధ్యక్షులుగా శీర సత్యనారాయణ, అధ్యక్షులుగా డాక్టర్ బొత్స వర ప్రసాద రావు, కార్య నిర్వాహక అధ్యక్షులుగాదొగ్గ దేముడు బాబు, ప్రధాన కార్యదర్శిగా తెంటు కాశీ నాయుడు, కోశాధికారిగా కచ్చాల కృష్ణమూర్తి ఎన్నికయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉమ్మడి విజయనగరం జిల్లాలో మా కొప్పుల వెలమ జనాభాకు తగ్గట్లు ప్రధాన రాజకీయ పార్టీలు టికెట్లు కేటాయించడం లేదన్నారు. ఎమ్మెల్యే, ఎంపి సీట్ల కేటాయింపు విషయంలో వివక్ష జరుగుతుందన్నారు. ప్రధాన రాజకీయ పార్టీలు 3ఎమ్మెల్యేలు విజయనగరం జిల్లాలో ఎక్కడైనా ఎమ్మెల్సీ ఒకటి, ఎంపి సీటు కేటాయించాలని డిమాండ్ చేశారు. త్వరలో ఒక చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి దాని ద్వారా తమ సామాజిక వర్గంలో పేదలకు కనీస అవసరాలు సమకూరుస్తామని తెలిపారు. సమావేశంలో గొట్టాపు చిన్నం నాయుడు, కిలపర్తి పరదేశీ నాయుడు, యాండ్రాపు తాతబాబు, బలగ సత్యనారాయణ, పెంట స్వామి నాయుడు, వైకుంతం వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు పెద్దపీట

ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అప్పలనర్సయ్య

ప్రజాశక్తి-గజపతినగరం

ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తోందని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య తెలిపారు. గురువారం గజపతినగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. తొలుత క్రికెట్ ఆడుతూ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం షటిల్ బ్యాడ్మింటన్ జాతీయ స్థాయి క్రీడాకారులు రామ్‌చరణ్, జాహ్నవిని దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ వి.ముత్యాలనాయుడు, ఎంపిపిలు బెల్లాన జ్ఞానదీపిక, చల్ల చల్లమనాయుడు, జెడ్‌పిటిసి గార తౌడు, ఎంపిడిఒ కె.కిశోర్‌కుమార్, వాణిశ్రీ, ఎంఇఒలు ఎస్.విమలమ్మ, సాయిచక్రధర్, సిఐ ఎన్‌వి ప్రభాకర్‌రావు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎల్‌వి రమణ, సర్పంచ్ బెల్లాన త్రినాథరావు, ఉప సర్పంచులు మండల సురేష్, కర్రి రామనాయుడు, కర్రి నానాజీ పాల్గొన్నారు.

బొబ్బిలి : స్థానిక గురుకుల పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి ఆడుదాం-ఆంధ్రా ఆటల పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. రెండోరోజు గురువారం కబడ్డీ పోటీలు నిర్వహించారు. పోటీలను ఎంపిడిఒ పి.రవికుమార్, ఫిజికల్ డైరెక్టర్లు పర్యవేక్షిస్తున్నారు.

శృంగవరపుకోట : ఆఫీసర్స్ క్లబ్‌లో ఆడుదాం ఆంధ్రా బ్యాడ్మింటన్ పోటీలు పోటీలను ఎంపిపి సోమేశ్వరరావు, వైస్ ఎంపిపి ఇందుకూరి సుబ్బలక్ష్మి, ఎంపిడిఒ శేషుబాబు, ఎంఇఒ బి.నర్సింగ్‌రావు ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలు హోరాహోరీగా సాగాయి. కార్యక్రమంలో క్రీడల నియోజకవర్గ కోఆర్డినేటర్ కె.కృష్ణంరాజు, మండల కోఆర్డినేటర్ పి.శ్రీరాములు పాల్గొన్నారు.

ముగిసిన పోటీలు

విజయనగరం టౌన్ : క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటూ మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. గురువారం స్థానిక రాజీవ్ స్టేడియంలో ఆడదాం ఆంధ్ర నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు జరిగాయి. అనంతరం విజేతలకు మెమొంటోలు, పథకాలను బహుకరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ సచివాలయ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పోటీలు నిర్వహించి గెలుపొందిన క్రీడాకారులకు పతకాలను, నగదు బహుమతులను అందజేస్తుందన్నారు. నియోజకవర్గస్థాయిలో గెలుపొందిన 9 టీంలు జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయిలో కూడా విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, ఎంపిపి మామిడి అప్పలనాయుడు, కమిషనర్ ఆర్.శ్రీరాములునాయుడు, సహాయ కమిషనర్ ప్రసాదరావు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కాళ్ళ సూరిబాబు పాల్గొన్నారు.



బొబ్బిలిలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారిణులు



విజయనగరంలో ట్రోఫీ అందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



బాధిత దళితులతో మాట్లాడుతున్న ట్రైనీ ఐపిఎస్ ఎజె అల్కాన్స్

లక్కింపేటలో ట్రైనీ ఐపిఎస్ పర్యటన

ప్రజాశక్తి-వంగర

మండలంలోని లక్కింపేటలో ట్రైనీ ఐపిఎస్ మండ జావలి అల్కాన్స్ గురువారం పర్యటించారు. అక్కడ దళితులు, బిసిలతో మాట్లాడారు. 2012లో గ్రామంలో జరిగిన ఘటన, ప్రస్తుతం గ్రామంలో ఉన్న ప్రస్తుత పరిస్థితులపై ఆరా తీశారు. ఎన్నికల సమీపిస్తున్న వేళ ప్రతి ఒక్కరూ శాంతియుతంగా మెలగాలని తెలిపారు. పోలీస్ సిబ్బందితో మాట్లాడి విధి నిర్వహణపై సూచనలు ఇచ్చారు. అంతకుముందు వంగర పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో రాజాం రూరల్ సిఐ ఎస్ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెసర పంటపై మంచు ప్రభావం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో తెల్లవారు జామున కురుస్తున్న మంచు వల్ల పెసర పంట పీత దశలోనే నాశనమైపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎడతెరిపి లేకుండా గత వారం రోజులుగా తేనె మంచుతో పాటు, అట్టమైన పొగ మంచు కూడా వర్షాలు తలపిస్తున్నట్లు పడుతుండడంతో పెసర పండి మాడిపోయి కాపు లేకుండా పోతుందని ఆవేదన చెందుతున్నారు. దీనికి తోడు మామిడి, జీడి పూత కూడా మాడిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా ప్రతిఒక్కరూ సహకరించాలని సిఐ మురళి కోరారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ మురళి మాట్లాడారు. శృంగవరపుకోట సర్కిల్ పోలీస్ స్టేషనును అప్‌గ్రేడ్ చేయడం వల్ల ఇద్దరు సిఐలు, ఇద్దరు ఎస్ఐలు విధులు నిర్వర్తిస్తారని చెప్పారు. పట్టణంలోని శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు గంగరాజు, మోహన్‌రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైసిపి హయాంలో అభివృద్ధి జాడేది?

జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి లోకం మాధవి

ప్రజాశక్తి-భోగాపురం

వైసిపి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి జాడే లేదని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి లోకం మాధవి తెలిపారు. నెల్లిమర్ల నియోజకవర్గ అభివృద్ధి కేవలం జనసేన, టిడిపి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని తెలిపారు. మన ఊరిలో జనవాణి కార్యక్రమాన్ని మండలంలోని గుడివాడ, రామచంద్రపేట, తోటపల్లి గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి మహిళలతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో అభివృద్ధి అనేది కనబడకుండా పోతుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పల్లంట్ల జగదీష్, పల్ల రాంబాబు, పిడుగు లక్ష్మణరావు పాల్గొన్నారు.

కళాసీ ఛార్జీల చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-గంట్యాడ

మండలంలోని వసాది గ్రామంలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి కళాసీ ఛార్జీల చెక్కులను గురువారం పంపిణీ చేశారు. పెంటశ్రీరాంపురం పిఎసిఎస్ నుంచి వచ్చిన చెక్కులను ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు లోకవరపు ఆదినారాయణమూర్తి, పిఎసిఎస్ కార్యదర్శి వెంకటరావు.. కళాసీలకు అందించారు.

డైట్ అధ్యాపకులకు సత్కారం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ఇటీవల డాక్టరేట్ పొందిన ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ సంస్థ (డైట్) అధ్యాపకులు రామకృష్ణారావును ప్రిన్సిపల్ ఎన్.తిరుపతినాయుడు ఆధ్వర్యాన విశ్రాంత ప్రొఫెసర్ ఎంఎస్ఆర్ శర్మ ఆత్మీయ సత్కారం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ యు.మాణిక్యం నాయుడు, సీనియర్ అధ్యాపకులు నాగేశ్వరరావు, స్టాఫ్ సెక్రటరీ డి.ఈశ్వరరావు, పి.రవికుమార్, కె.సూర్యారావు, ఎం.శ్రీనివాస, ఎం.రామకృష్ణ, ఆఫీస్ సూపరింటెండెంట్ బి.కమలకుమారి పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కడకొండ, చినదుంగాడ ప్రాథమిక పాఠశాలలను ఎంఇఒ పి.బాలభాస్కరరావు గురువారం సందర్శించారు. పాఠశాల పరిసరాలు, విద్యార్థుల పుస్తకాలు, మధ్యాహ్న భోజనం పరిశీలించారు.

హోరాహోరీగా ఎడ్ల పరుగు పోటీలు

ప్రజాశక్తి-వేపాడ

వల్లంపూడిలో సాంబమూర్తి తీర్థం సందర్భంగా నిర్వహించిన ఎడ్ల పరుగు పోటీలు హోరాహోరీగా సాగాయి. విజేతలకు ఉత్సవ కమిటీ సభ్యులు నగదు బహుమతులు అందజేశారు.

అవసరం లేని పత్రాలు దహనం

ప్రజాశక్తి-విజయనగరం

జిఒ 135 ప్రకారం ఖజానా కార్యాలయంలో భద్రపరిచిన ఉపయోగంలో లేని చెక్ బుక్కులను దహనం చేసేందుకు జాయింట్ కలెక్టర్ అధ్యక్షతనగల కమిటీ ఆదేశాలు జారీ చేసింది. ఈనేపథ్యంలో గురువారం కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా ఖజానా స్ట్రాంగ్ రూమ్ దగ్గర జిల్లా ఖజానా కార్యాలయములలో ఉన్న నిరుపయోగ చెక్ బుక్ లను కలెక్టరేట్ఎఒ, వన్ టౌన్ సిఐ, అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్, జిల్లా ఖజానా అధికారి సమక్షంలో దహనం చేసినట్లు ఖజానా అధికారి ఆర్ఎఎస్ కుమార్ తెలిపారు.

'తెలగ'ను బిసిలో చేర్చాలని వినతి

ప్రజాశక్తి - మెంటాడ

తెలగ సామాజిక తరగతిని బిసి జాబితాలో చేర్చాలని ఆ సంఘం నాయకులు గురువారం తహశీల్దార్ రామకృష్ణకు వినతి అందించారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులు అస్తవ్యస్తంగా ఉన్నాయని వివరించారు. దుర్భరమైన జీవితాన్ని అనుభవిస్తూ ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో తెలగ సంఘం నాయకులు అంగుడు రాంబాబు, ఎ.రమణ, ఎ.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సారా నిర్మూలనే ధ్యేయం

ప్రజాశక్తి-రామభద్రపురం

నాటుసారా నిర్మూలనే ధ్యేయంగా నిఘా ఉంచామని ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపారు. గురువారం రావివలస పంచాయతీ కొండ గుడ్డివలస గిరిశిఖర శివారులో సారా వంట కోసం సిద్ధంగా ఉంచిన సుమారు వెయ్యి లీటర్ల బియ్యపు గంజి ఊటను నేల మట్టం చేశారు. నాటుసారా తయారీ, సేవనం చట్ట వ్యతిరేకమన్నారు. మద్యం గొలుసు దుకాణాలు నిర్వహణపై కూడా ప్రత్యేక నిఘా ఉంచామని, ప్రభుత్వ దుఖానాల నుంచి పరిమితికి మించి రవాణా చేసినా,అక్రమ మద్యం అమ్ముతున్నా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత

ప్రజాశక్తి-బొబ్బిలి

పార్వతీపురం నుంచి మానపురం సంతకు అక్రమంగా తరలిస్తున్న 43 పశువులను పోలీసులు పట్టుకున్నారు. పారాది సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా 6 వాహనాలలో 43 పశువులను తరలిస్తున్నట్లు గుర్తించి పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు ఆదేశాలు మేరకు హెడ్ కానిస్టేబుల్ ఎన్.రాములు వాహనాలను సీజ్ చేసి 43 పశువులను గోశాలకు తరలించారు. అక్రమంగా పశువులు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ నాగేశ్వరరావు హెచ్చరించారు.

ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని ఉంగరాడ గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని గురువారం అరెస్ట్ చేసినట్లు ఎఎస్ఐ రాజారావు తెలిపారు. వీరి నుండి 5860 రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

ఓటు హక్కు వజ్రాయుధం

ప్రజాశక్తి-బొబ్బిలి

ఓటుహక్కుతో మంచి ప్రభుత్వాలను ఎన్నుకోవచ్చని మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అన్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. మున్సిపల్ ఉద్యోగులు, మెప్మా ఆర్‌పిలు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పి.ఉమా, ఇంటి గోవింద్, ఎస్.రామకృష్ణ, ఎస్.లక్ష్మి, మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, ఆర్ఒ ప్రసాద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : తహశీల్దార్ డి.రాజేశ్వరావు ఆధ్వర్యంలో విద్యార్థులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ సాయిశ్రీ, కమిషనర్ శ్రీనివాసరావు, తహశీల్దార్ రాజేశ్వరరావు, ఎంఇఒలు లక్ష్మణరావు, వాసునాయుడు మాట్లాడారు. అనంతరం సీనియర్ ఓటర్లను, ట్రాన్స్ జెండర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఎన్నికల డిటి జి.గౌరీశంకర్రావు, హెచ్‌డిటి సాయికృష్ణ, ఆర్‌హెచ్ డిటి అప్పయ్య, ఆర్ఐ కళ్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

మెంటాడ : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ టి.రామకృష్ణ ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో బొడ్డు రామ్మూర్తి, నంబూరు నారాయణమూర్తి, విశ్రాంత ఉపాధ్యాయులు, ముప్పిడి బంగారయ్యను సత్కరించారు. డిటి వెంకటరావు, ఎఎస్ఒ శంకర్రావు, విశ్రాంత ఉపాధ్యాయుడు గంర్రేటి అప్పలనాయుడు, రెడ్డి రాజగోపాల్ పాల్గొన్నారు.

నెల్లిమర్ల : స్థానిక ఆదిత్యా విద్యాలయంలో చిన్నమాంబ యువజన సేవా సంఘం, ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇఆర్ఒ ఎం.నూకరాజు, తహశీల్దార్ డి.ధర్మరాజు, ఎలక్షన్ డిటి ఎన్‌వివిఎస్ మూర్తి, ఎంఇఒ ఈపు విజయ్‌కుమార్, హెచ్‌ఎం వి.అమృత పాల్గొన్నారు. మిమ్స్‌లో డిప్యూటీ కలెక్టర్ ఎం.నూకరాజు అధ్యక్షతన తహసీల్దార్ డి.ధర్మ రాజు ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మిమ్స్ కాలేజీ డీన్ సిహెచ్ లక్ష్మీ కుమార్, వివిఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.



మెంటాడలో సీనియర్ సిటిజన్లను సన్మానిస్తున్న అధికారులు



తెర్లాంలో ర్యాలీ చేపడుతున్న అధికారులు, సిబ్బంది



నెల్లిమర్ల.. మిమ్స్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, యాజమాన్య ప్రతినిధులు, విద్యార్థులు

తెర్లాం : తెర్లాంలో ఓటు హక్కు వినియోగంపై వెంకటేశ్వర జూనియర్ కాలేజ్ విద్యార్థులు అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో తహశీల్దార్ రతన్‌కుమార్, ఎంపిడిఒ రామకృష్ణ, ఎస్ఐ ఆర్.రమేష్ పాల్గొన్నారు.

కొత్తవలస : ఓటర్ల దినోత్సవం సందర్భంగా సీనియర్ ఓటర్లకు తహశీల్దార్ శ్రీనివాస్ మిశ్రా సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్, సిబ్బంది పాల్గొన్నారు.

శృంగవరపుకోట : పట్టణంలో తహశీల్దార్ శ్రీనివాసరావు ఆధ్వర్యాన ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి సుదర్శన దొర మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపల్ జెవి కృష్ణమూర్తి, ఎలక్షన్ డిటి నారాయణమ్మ, సిఎస్ డిటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రామభద్రపురం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సముదాయం నుంచి మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో మానవహారంగా ఏర్పడి ఓటర్లతో, విద్యార్థులతో తహశీల్దార్ సులోచనారాణి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సుబ్బారావు, ఎంఇఒ తిరుమలప్రసాద్, ఎస్ఐ జ్ఞానప్రసాద్ పాల్గొన్నారు.

హక్కులను కాలరాస్తే సహించం

మండల సమావేశంలో సర్పంచులు, ఎంపిటిసిల ఆగ్రహం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ప్రజలతో ఎన్నుకోబడిన సర్పంచులు, ఎంపిటిసి సభ్యుల హక్కులను కాలరాస్తే సహించబోమని పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి సోమేశ్వరరావు అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.కోట మేజరు పంచాయతీ సర్పంచ్ సంతోష్ కుమారి మాట్లాడుతూ సర్పంచ్‌కు తెలియకుండా పంచాయతీ కార్యాలయంలో వాలంటీర్లు, గృహ సారదులతో ఉప సర్పంచ్ సమావేశం ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. తాను చదువుకున్న ఎస్‌టి మహిళనని, సర్పంచ్ హక్కులకు పదే పదే భంగం కలిగిస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. సర్పంచ్‌కి ఎంపిపి, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు మద్దతు తెలుపుతూ... సమావేశం నిర్వహించేందుకు అనుమతించిన సచివాలయం-3 కార్యదర్శిని నిలదీశారు. ఎవరైనా స్థానిక సర్పంచుకు తెలియకుండా పంచాయతీ కార్యాలయాల్లో సమావేశాలు ఏర్పాటు చేస్తే చర్యలకు సిఫార్సు చేస్తామని ఎంపిడిఒ శేషుబాబు, ఇఒపిఆర్‌డి లక్ష్మీ హెచ్చరించారు. ఇదే సమయంలో ధర్మవరం సర్పంచ్ గాలి సన్యాసయ్య.. తమ గ్రామంలోనూ సర్పంచ్‌ని పట్టించుకోకుండా అధికారపార్టీ నేతలు సమావేశాలు నిర్వహిస్తుండటం, కొత్త పింఛన్ల పంపిణీలో ఒక్కరికీ తనతో ఇప్పించకుండా ఎస్‌సి సర్పంచునని చిన్నచూపు చూశారని ఆవేదన వ్యక్తంచేశారు. ఎంపిపి జోక్యం చేసుకుని ఇలాంటి పరిస్థితి గ్రామాల్లో పునరావృతం కాకుండా చూడాలని ఎంపిడిఒకు సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి సోమేశ్వరరావు

దుమ్మాకొడుతున్న ఉపాధ్యాయులపై చర్యలు

గిరిజన గ్రామాలు పల్లపుదుంగాడ, గూనపాడులో ఉపాధ్యాయులు దుమ్మాకొడుతున్న తీరుపై ఎంఇఒ నరసింగరావును ఎంపిపి, వైస్ ఎంపిపి నిలదీశారు. ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులు దుమ్మాకొడుతున్న వైనాన్ని అక్కడి గిరిజనులు నిలదీస్తుంటే ప్రజాప్రతినిధులుగా తామేం సమాధానం చెప్పాలో మీరే చెప్పాలని ఎంఇఒను ప్రశ్నించారు. వారిపై చర్యలకు సిఫార్సు చేయాలన్నారు.

అనంతరం ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ కిశోర్, విద్యుత్తు శాఖ ఎఇ రవి మాట్లాడుతూ ఆయా శాఖల పరంగా చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఎంపిడిఒ శేషుబాబు, ఇఒపిఆర్‌డి లక్ష్మి మాట్లాడుతూ పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేసేందుకు నిధులు కొరత లేదని, త్వరితగతిన పనులు చేపట్టాలని సర్పంచులకు సూచించారు. సమావేశంలో జెడ్‌పిటిసి ఎం.వెంకటలక్ష్మి, పలు శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

కార్మికులను పనిలోకి తీసుకోవాలని దీక్ష

ప్రజాశక్తి-పూసపాటిరేగ

అకారణంగా తొలగించిన 49 మంది కార్మికులను వెంటనే పనిలోకి తీసుకోవాలంటూ మండలంలోని సిపి ఆక్వా పరిశ్రమ వద్ద కాంట్రాక్టు కార్మికులు గురువారం నిరాహార దీక్ష చేపట్టారు. యాజమాన్యం మొండి వైఖరి నశించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు నల్లా అప్పలరాజు మాట్లాడుతూ ఎటువంటి నోటీసులూ జారీ చేయకుండా అకారణంగా తొలగించడం అన్యాయమన్నారు. కార్మికుల తొలగింపులో యాజమాన్యం తప్పులేదని, స్థానికంగా ఉన్న ఇద్దరు కాంట్రాక్టర్ల వల్లే అన్యాయం జరుగుతోందని వాపోయారు. కార్మికులకు న్యాయం జరిగే వరకూ శాంతియుతంగా నిరాహార దీక్ష కొనసాగిస్తామని స్పష్టంచేశారు. మద్దతుగా నిలిచిన ఇతర పరిశ్రమల కార్మికులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల జరిగిన డిసిఎల్ సమావేశంలో పది మంది వరకు కార్మికులను పనిలోకి తీసుకుంటామని యాజమాన్యం చెప్పిందన్నారు. మిగిలిన 38 మందిని విడతల వారీగా తీసుకోవాలని కోరారు.



నిరాహార దీక్షలో పాల్గొన్న కార్మికులు

చంద్రబాబుతోనే భవిష్యత్తుకు భరోసా

టిడిపి నాయకులు కిమిడి నాగార్జున



కరపత్రాలను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు కిమిడి నాగార్జున

ప్రజాశక్తి-గరివిడి

చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తుకు భరోసా అని చీపురుపల్లి నియోజకవర్గ ఇన్చార్జి కిమిడి నాగార్జున అన్నారు. గురువారం దువ్వాం గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. పార్టీ అధినేత చంద్రబాబునాయుడు మేనిఫెస్టోలో ప్రకటించిన మహాశక్తి పథకం రాష్ట్ర మహిళలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని చెప్పారు. ప్రతీ మహిళకు రూ.1500 ఆర్థిక సహాయం, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు వంటి ఉచిత పథకాలతో వైసిపి నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. కచ్చితంగా ఈ పథకాలు మహిళలను ఆదుకుంటాయని తెలిపారు. రానున్న ఎన్నికల్లో టిడిపికి అత్యధిక మెజారిటీ రావడం ఖాయమని చెప్పారు. కార్యక్రమం లో పైల బలరాం, సారేపాక సురేష్ బాబు, వాలే చిట్టయ్య, పిన్నింటి అప్పారావు, కలిశట్టి జోగినాయుడు, బొంతు రామునాయుడు,మహంతి రమణ మూర్తి, యజ్జిపరపు సత్యం, శనపతి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తు కాపాడుకుందాం

విజయనగరం కోట : రాష్ట్ర భవిష్యత్తు ను కాపాడుకుందామని విజయనగరం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ అదితి విజయలక్ష్మి గజపతిరాజు ప్రజలను కోరారు.గురువారం బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా విజయనగరం పట్టణం 16వ , 12వ డివిజన్ లలో నియోజకవర్గ ఇంచార్జ్ పూసపాటి అదితి గజపతి రాజు ఇంటింటి ప్రచారం నిర్వహించిన అనంతరం ఆమె మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు వివరించారు, రాష్ట్రాన్ని కాపాడాలంటే తెలుగుదేశం - జనసేన ప్రభుత్వం ఏర్పడాలని, అందుకు ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, విజయనగరం మండల పార్టీ అధ్యక్షులు బొద్దుల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, రాష్ట్ర బీసీ నాయకులు వేచలపు శ్రీనివాసరావు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు , నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ, జనసేన పార్టీ 12,16వ డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతంలో ప్రాంగణ నియామకాలు

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం ఇంజనీరింగ్ కళాశాలలో డాక్టర్ రెడ్డీస్ సంస్థ ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు ప్రాంగణ నియామకాలు నిర్వహించింది. ఈ నియామకాలకు విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి ఇంటర్వ్యూ చేశార. ఎంపికైన వారిని ఎస్. ఎమ్. టి గా నియమించుకున్నారు. ఈ ప్రాంగణ నియామకాలకు సుమారు 500 మంది హాజరవ్వగా అందులో 120 మందిని ఎంపిక చేశారు. రెడ్డీస్ సంస్థకు చెందిన లీడ్ ఎంప్లాయ్ రిలేషన్స్ అధిపతి డి.లక్ష్మి దీపక్, ఎల్అండ్‌డి మేనేజర్ శ్రీ లక్ష్మి దుర్గ ఆధ్వర్యంలో జరిగాయి.సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ రావు మాట్లాడుతూ డాక్టర్ రెడ్డీస్ సంస్థ చాలా మంది విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి రామమూర్తి, కళాశాల ప్లేస్మెంట్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

భారతరత్న పట్ల నాయీబ్రాహ్మణుల హర్షం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాగూర్ శత జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఆయనకు భారతరత్న అవార్డు ప్రకటించడం నాయీ బ్రాహ్మణ జాతికే గర్వకారణమని ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం అంబేడ్కర్ కూడలిలోని ప్రజా గ్రంథాలయంలో జరిగిన సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టివి దుర్గారావు మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణ వృత్తి చేస్తూ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతూ బీహార్ మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా, ముఖ్యమంత్రిగా అంచాలంచెలుగా ఎదిగిన కర్పూరి ఠాగూర్‌ను స్మరించుకోవడం ఎంతయినా అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పి.షణ్ముఖ రావు, పట్నాన సిమ్మయ్య, తమిరి సత్యనారాయణ, తాతపూడి హనుమంతరావు, రమేష్, త్రినాధ్ రావు, వినయ్, ఇఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.

అపరాల పంటలు పరిశీలన

ప్రజాశక్తి-గంట్యాడ

మండలంలోని రామవరం, లక్కిడాం గ్రామాల్లో అపరాల పంటలను గురువారం వ్యవసాయ శాఖ జెడి విటి రామారావు పరిశీలించారు. కట్టిజనుము పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. లక్కిడాం గ్రామంలో తిలపర్తి సత్యవతి పొలాన్ని పరిశీలించారు. సస్యరక్షణ పద్ధతులను వివరించారు. కట్టిజనుము మార్కెట్ దిగుబడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మినప పంటను పరిశీలించి, దిగుబడుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎఒ బి.శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

బొండపల్లి : మండలంలో మరువాడలో అపరాల పంటలను వ్యవసాయ శాఖ జెడి విటి రామారావు పరిశీలించారు. పెసర, మినుము సంరక్షణకు సంబంధించి తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. ఇ-పంట నమోదుపై రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎఒ మల్లికార్జునరావు, ఎఇఒ సంతోష్, విఎఎ సత్యవతి పాల్గొన్నారు.



అపరాల పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ జెడి రామారావు

జెవివి బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జనవిజ్ఞాన వేదికను క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే దిశగా జిల్లా కమిటీ కృషి చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎల్.సుజాత పిలుపునిచ్చారు. పట్టణంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో గురువారం సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుజాత మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక శాస్త్రియ పరంగా ఎన్నో ఉద్యమాలు చేసి విజయం సాధించినప్పటికీ క్షేత్రస్థాయిలో జనవిజ్ఞాన వేదికను బలోపేతం చేసి, ప్రజలకు మరింత చేరువ చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు ఎరుకొండ ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జనవిజ్ఞాన వేదిక జాతీయ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ ఎం.వి.ఆర్ కృష్ణాజి, జాతీయ విద్యా విభాగం కన్వీనర్ డాక్టర్ ఎవి రాజశేఖర్, సాంస్కృతిక విభాగం రాష్ట్ర కన్వీనర్ గంర్రేటి శ్రీను, రాష్ట్ర నాయకులు యోహాన్,జిల్లా ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, పట్టణ ప్రధాన కార్యదర్శి పి.షణ్ముఖరరావు తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న ఫోన్లతో డిఎస్‌పి గోవిందరావు

పోగొట్టుకున్న మొబైల్స్ అందజేత

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న 139 మొబైల్స్ను ట్రేస్ చేసి, వాటిని డిఎస్‌పి ఆర్.గోవిందరావు గురువారం తమ కార్యాలయంలో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ - సైబరు సెల్ పోలీసులకు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా పోయిన మొబైళ్లను ట్రేస్ చేసేందుకు సైబరు సెల్ పోలీసులు, సిబ్బంది నిరంతరం చర్యలు చేపడుతున్నారన్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల గురించి ఫిర్యాదు చేసిన కొద్ది రోజుల్లోనే సైబర్ సెల్ పోలీసులు 139 మొబైల్ ఫోన్లను ట్రేస్ చేసారన్నారు. ఈఫోన్లను ఎస్‌పి ఆదేశాలతో బాధితులకు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సైబర్ సెల్ ఎస్ఐలు ప్రశాంత కుమార్, నజీమా బేగం, సైబర్ సెల్ కానిస్టేబుళ్లు వాసుదేవ్,శ్రీనివాసరావు మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీపై బిందు సేద్య పరికరాలు

ప్రజాశక్తి-కొత్తవలస

రైతులకు సబ్సిడీపై బిందు సేద్యం పరికరాలను అందిస్తామని ఎపిఎంఐపి పీడీ లక్ష్మీనారాయణ తెలిపారు. కొత్తవలస మండలంలో లక్ష్మీనారాయణపురం గ్రామంలో రైతు పొలమరశెట్టి భూలక్ష్మి పొలంలో అమర్చుకున్న స్ప్రింకర్ల వ్యవస్థను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి మండలంలో గులివిందాడ, చీడివలస, మిందివలస, రామచంద్రపురం గ్రామాల్లో రైతులకు సబ్సిడీపై బిందుసేద్య పరికరాలను అందజేసినట్లు తెలిపారు. వర్షాధారంపై పంటలు పండించే రైతులకు మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా అందుతున్న బిందు సేద్యం పట్ల రైతులు అవగాహన పెంచుకొని, ఆదాయం ఎక్కువగా వచ్చేలా ఆలోచించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎఒ మాధురి శరణ్య, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు



బిందు సేద్యాన్ని పరిశీలిస్తున్న పిడి లక్ష్మీనారాయణ